## క్లుప్తంగా

### ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణ పరిరక్షణ



గుంటూరు రూరల్: ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణ పరిరక్షణ కలుగుతుందని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్థానిక ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. సేవా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వై సుజిత్‌కుమార్, డైరెక్టర్ డి. వినయ్‌కుమార్, ఆర్. శ్రీనివాసులు, కె. శ్రీనివాసరావు అభినందించారు.

### నేడు మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

పొన్నూరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు పట్టణం 23వ వార్డులోని లూథరన్ చర్చిలో ప్రార్థనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్, 10 గంటలకు 8వ వార్డులో మాజీ కౌన్సిలర్ మూకిరి అనిలా కుమారి ఇంటి వద్ద పేదలకు దుప్పట్ల పంపిణీ ఉంటుందని తెలిపారు. 10.30 గంటలకు 6వ వార్డు విద్యానగర్ వృద్ధాశ్రమంలో, 11 గంటలకు కుసుకర్రు రోడ్డు అమ్మ వృద్ధాశ్రమంలో అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొన్నూరు: పట్టణం, మండల పరిధిలో 11 కేవీ విద్యుత్ వైర్లకు మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె. శ్యాం కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాన్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# తాగునీటి సరఫరాపై గరం.. గరం



మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు



వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ కార్పొరేటర్లు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు శుక్రవారం అధ్యక్షతన జరిగింది. ఉదయం 10.40 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. మొత్తం 361 అంశాలలో సభ్యుల ప్రశ్నలు 99 కాగా..మిగిలినవి సభ్యుల ప్రతిపాదనలు, ప్రియాంబుల్స్ ఉన్నాయి. గుంటూరు నగరానికి పక్కనే కృష్ణా నది ఉన్నప్పటికీ ప్రజలకు తాగునీటిని అందించలేకపోతున్నారని, లీకుల పేరుతో నెలన్నర రోజుల్లో రెండు సార్లు అంతరాయం ఏర్పడిందని కౌన్సిల్‌లో ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఇతర సభ్యులు అధికారులను నిలదీశారు. శుక్రవారం సాయంత్రం వరకు 25 ప్రశ్నలకు మాత్రమే చర్చ జరిగింది. మిగిలిన వాటిపై చర్చించేందుకు ఈ నెల 28వ తేదీకి కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారు.

**కరెంట్ సాకుగా చూపడం సిగ్గుచేటు**

విజయవాడ నుంచి తాగునీటిని తక్కెళ్లపాడు తీసుకువచ్చే క్రమంలో ఎక్కడైనా కరెంట్ పోతే గుంటూరు నగరంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అడిగిన ప్రశ్నకు అధికారులు చెప్పిన సమాధానంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ సోర్స్ ఉన్నప్పటికీ రెండు గంటలు కూడా నీటిని ఇవ్వకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ సిటీలో అనధికార ట్యాపులు ఉన్నాయని, కేవీపీ కాలనీలో 165 అనధికార ట్యాపులను తొలగించామని తెలిపారు. గుంటూరు నగరానికి విజయవాడ నుంచి 142 ఎంఎల్‌డీ వాటర్ వస్తుందని, ఆ నీరంతా ఎటు పోతుందో అర్థంకావడం లేదన్నారు. దీన్ని స్ట్రీమ్ లైన్ చేసి తాగునీటి సరఫరాను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తామని తెలిపారు. నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి టూ టౌన్‌కి ప్రత్యేకంగా పైపులైన్ వేశారని, నెహ్రూనగర్ రైల్వే గేటు వద్ద ఇంటర్ కనెక్షన్ ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యే మాధవి ప్రశ్నించారు. దీనికి స్థానికుల నుంచి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటిని ప్రజాప్రతినిధులతో కలిసి పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. గోరంట్ల వాటర్ ట్యాంక్ నిర్మాణం ఇంకా ఎంత కాలం సాగదీస్తారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రశ్నకు జనవరి నాటికి పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని చెప్పారు.

**45 రోజులకొకసారి కౌన్సిల్ పెట్టాలి : మేయర్ కావటి**

గత కౌన్సిల్ సమావేశంలో నెల రోజులకొకసారి కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని సభ్యులందరూ తీర్మానించినప్పటికీ నాలుగు నెలలు గడిచిన తరువాత పెట్టడంపై కార్పొరేటర్లు అచ్చాల వెంకట రెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ, షేక్ రోషన్, ఇతర కౌన్సిల్ సభ్యులు అధికారులను నిలదీశారు. 45 రోజులకొకసారి కౌన్సిల్ నిర్వహించాలని తీర్మానించినప్పటికీ ఎందుకు పెట్టలేదని మేయర్ కావటి మనోహర్‌నాయుడు ప్రశ్నించారు. వరదల కారణంగా ప్రత్యేక కౌన్సిల్ సమావేశం పెట్టి చర్చించాలని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు లేఖ రాసినప్పటికీ అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఇక నుంచి నెల రోజులు కాగానే సభ్యులు ప్రశ్నలు, ప్రతిపాదనలు సెక్రటరీకి అందజేస్తే 15 రోజుల్లో అధికారులు దీనికి సంబంధించి సమాధానాలు తయారు చేసుకుని కౌన్సిల్ నిర్వహించాలని ఆదేశించారు.

**ఇంజినీరింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేస్తాం: కమిషనర్**

ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే వర్కు ఇన్‌స్పెక్టర్లు, ట్యాప్ వర్కర్లు, ఇతర సిబ్బందికి అంతర్గత బదిలీ నిర్వహించి, అవినీతికి తావులేకుండా చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలియజేశారు. ఖాళీ స్థలాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని దీనికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవి ప్రశ్నకు అధికారులు ఇచ్చిన సమాధానంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు.

**కౌన్సిల్‌కు క్యారేజీలు తెచ్చుకుంటాం**

సభ్యులకు భోజనాలు ఏర్పాటు చేసే ప్రక్రియలో అధికారులు విఫలం చెందారు. కనీసం అన్నం పెట్టడం లేదని, ప్లేట్లు లేవని, మహిళల వెయింటింగ్ రూమ్ అధ్వానంగా ఉందని కార్పొరేటర్ కనకదుర్గ అధికారులను నిలదీశారు. మరో కార్పొరేటర్ మర్రి అంజలి మాట్లాడుతూ సభ్యులకు భోజనాలే సక్రమంగా పెట్టకపోతే ఎలా... ఈసారి నుంచి కౌన్సిల్‌కు ఇంటి నుంచే క్యారేజీలు తెచ్చుకుంటామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు అన్నం లేకపోవడంతో వారు ఏడ్చుకుంటూ వెళ్లిపోయారు.

**కూటమి నేతల ఓవర్ యాక్షన్**

కౌన్సిల్ సమావేశంలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై వైఎస్సార్‌సీపీ సభ్యులు అధికారులను ప్రశ్నిస్తున్న క్రమంలో టీడీపీశ్రేణులు ఓవర్ యాక్షన్ చేశారు. ఒకానొక సందర్భంలో టీడీపీ కార్పొరేటర్ నూకవరపు బాలాజీ అతిగా మాట్లాడారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు మానసిక స్థితి బాగోలేదేమో ఆసుపత్రిలో చూపించుకోండని వెటకారంగా మాట్లాడటంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు మండిపడ్డాయి.

# రెండు గ్రామాల్లో స్వమిత్వ సర్వే ప్రారంభం



గనికపూడిలో గ్రామ పటాన్ని పరిశీలిస్తున్న డీపీవో, సర్వే ఆఫ్ ఏడీ తదితరులు

ప్రత్తిపాడు: స్వమిత్వ (సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాంపింగ్ విత్ ఇంప్రావైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) సర్వే గ్రామాల్లో ప్రారంభమయ్యింది. గతంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో తొలివిడతగా మండలంలో రెండు గ్రామాలను ఎంపిక చేసుకున్నారు. అందులో భాగంగా ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం, గనికపూడి గ్రామాల్లో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్వేయర్లు సర్వేను ఆరంభించారు. గ్రామ కంఠాలతో పాటు నివాస, నివాసేతర స్థలాలను అత్యాధునిక రోవర్‌ల ద్వారా సర్వే చేయనున్నారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియను గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయికుమార్, సర్వేశాఖ ఏడీ పవన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కిషోర్‌లు పరిశీలించారు. సర్వేలో సాంకేతిక ఇబ్బందులు, క్షేత్రస్థాయిలో ఉత్పన్నమవుతున్న వివరాలను పంచాయతీ కార్యదర్శి, విలేజ్ సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. తప్పులకు ఆస్కారం లేకుండా సర్వే పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సర్వే ఆఫ్ ఏడీ పవన్ కుమార్ మాట్లాడుతూ సర్వే పూర్తయిన తరువాత స్థల యజమానులకు 9(2) నోటీసులు ఇచ్చి, అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పారు. సర్వే ప్రక్రియ పూర్తి అయితే స్థల, ఇంటి యజమానులకు శాశ్వత హక్కులతో కూడిన ప్రాపర్టీ కార్డులను ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు.

ఈ కార్డుల్లో పొలాల మాదిరి హద్దులు కూడా నమోదు చేస్తామని చెప్పారు. సర్వేకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జి. రవి కుమార్, కార్యదర్శులు, సర్వేయర్లు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో వినియోగంలోకి ఎస్‌డబ్ల్యూపీసీలు

**జిల్లా పంచాయతీ అధికారి నాగసాయికుమార్**



గొట్టిపాడులోని ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న డీపీవో నాగసాయికుమార్

ప్రత్తిపాడు: జనవరి ఒకటవ తేదీ నాటికి అన్ని చెత్త నుంచి సంపద కేంద్రాలను (ఎస్‌డబ్ల్యూపీసీ) వినియోగంలోకి తీసుకువస్తామని జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయికుమార్ అన్నారు. ప్రత్తిపాడు మండలంలో అక్టోబరులో పునఃప్రారంభించిన ఎస్‌డబ్ల్యూపీసీలు వినియోగంలో లేవని, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయని, గొట్టిపాడులో ఉన్నప్పటికీ వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేస్తున్నారంటూ ఈ నెల 4న 'స్వచ్ఛ లక్ష్యం మరిచారు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డీపీవో ఆదేశాలతో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రోడ్డుపక్కన పడేసిన వ్యర్థాలను తొలగించి, ఎస్‌డబ్ల్యూపీసీలను శుభ్రం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం డీపీవో నాగసాయికుమార్ గొట్టిపాడులో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. షెడ్‌ను వాడుకలోనికి తీసుకురావాలని గ్రామ సర్పంచ్ మరియరాణికి సూచించారు. వానపాములతో వర్మీ కంపోస్టు తయారుచేసి పంచాయతీకి ఆదాయ మార్గాలను పెంచుకోవాలని తెలిపారు. తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించాలని చెప్పారు. నెలాఖరుకు సమస్యలన్నీ పరిష్కరించి షెడ్లను వినియోగంలోనికి తీసుకురావాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఈవోపీఆర్డీ జి. రవికుమార్‌కు హెచ్చరించారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



ర్యాలీలో విద్యార్థులు, పోలీసులు

పొన్నూరు: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ రవికిరణ్ తెలిపారు. ఆందోళన కలిగించే మాటలతో సైబర్ నేరగాళ్లు భయపెడతారని, అలా వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో ఆయన ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వాట్సాప్, వీడియో కాల్స్‌కు ఆందోళన చెందకుండా ప్రజలు కాస్త అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఏ ప్రభుత్వ దర్యాప్తు సంస్థ కూడా ఫోన్ ద్వారా విచారించదని గుర్తుంచుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీహరి, సిబ్బంది, నిడుబ్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు సత్వర పరిష్కారం



రెవెన్యూ సదస్సులో రైతులతో మాట్లాడుతున్న డెప్యూటీ తహసీల్దార్ ధర్మతేజ

ప్రత్తిపాడు: రెవెన్యూ సదస్సుల్లో వచ్చే భూ సంబంధ సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని డెప్యూటీ తహసీల్దార్ ధర్మతేజ అన్నారు. మండల పరిధిలోని నడింపాలెం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతుల నుంచి మ్యుటేషన్‌కు ఒక అర్జీ, ఎఫ్‌లైన్ పిటిషన్లు 19 వచ్చాయి. ఆయా అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని డీటీ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈవో వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో సీతయ్య పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

శలపాడు(చేబ్రోలు): భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కే శ్రీనివాసశర్మ అన్నారు. చేబ్రోలు మండలం శలపాడు, శేకూరు గ్రామాల్లో శుక్రవారం సదస్సులు జరిగాయి. మ్యుటేషన్లు, అడంగల్, సర్వే తదితర అంశాలపై 74 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిని నెల రోజుల్లో పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దారు శ్రీనివాసశర్మ తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, దేవదాయ శాఖ ఈవో పోతుల రామకోటేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైలా వెంకట రామరాజు, ఆర్ఐ, వీఆర్వో పాల్గొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు**

పొన్నూరు: రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి అందే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ జియావుల్‌హక్ అన్నారు. శుక్రవారం మండలంలోని వల్లభరావుపాలెంలో నిర్వహించిన సదస్సులో ప్రజల నుంచి ఆయన 58 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ రాజా రమేష్, సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్ఓ రవూఫ్ పాల్గొన్నారు.



# సాక్షి క్లాసిఫైడ్స్

**REAL ESTATE**

■ గుంటూరులో కమర్షియల్ మరియు రెసిడెన్షియల్ ఇళ్ళు, స్థలాలు, పొలాలు, ప్లాట్లు, అమ్మదలచినా, కొనదలచినా సంప్రదించగలరు. 62814 94079

**BUILDING FOR SALE**

■ గుంటూరు, గోరంట్ల 65గ।।లలో కట్టిన కొత్త బిల్డింగ్ అమ్మబడును. నార్త్, వెస్ట్‌ఫేస్, క్రింద 2 షాప్స్, పైన ఇల్లు, 100%వాస్తు. 25Kఅద్దెవస్తుంది. 88లక్షలు 9908734363

**PLOT FOR SALE**

■ రాజధాని అమరావతి పరిధిలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తాడికొండ క్రాస్‌రోడ్స్ దగ్గర పొన్నెకల్లు నందు 40ఎకరాల APCRDA అప్రూవ్డ్ నూతన గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ నందు ప్రీమియర్ ఓపెన్ ప్లాట్స్ కలవు. లాంచింగ్ ఆఫర్ కలదు. సంప్ర।। 9573825599

**SERVICES**

**BUSINESS OFFER**

■ నిరుద్యోగులకు, గృహిణులకు, రిటైర్డ్ ఎంప్లాయిస్, వ్యాపారస్తులు ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం వర్క్ చేయడం వలన మంచి ఆదాయం సంపాదించుకోవచ్చు ఆసక్తి గలవారు సంప్ర: 9100228505

**DOCUMENT MISSING**

■ ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. గంగిరెడ్డి అంకిరెడ్డి గారి కుమార్తె గంగిరెడ్డి సుమలత గారి సర్వే నెం. 201/A1, 201/A2, 205/A1B, 205/A2, 205/A3, 205/A4, 117/9 ప్లాట్ నెం. 34 కు చెందిన లింకు దస్తావేజుల నెం. 5943/1983. శ్రీ లక్ష్మీనగర్ 1వలైను ఇంటి నుండి జిరాక్స్ షాపుకు వెళ్ళినప్పుడు పోయినవి. ఎవరికైన దొరికినచో ఈ క్రింది నెంబరుకు తెలియపర్చగలరు 9491667094

**GOLD FINANCE**

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 91699 22299

**WANTED**

■ కమలాక్షి బోటిక్ నందు పనిచేయుటకు ఉత్సాహవంతులైన లేడీ హెల్పర్స్ కావలెను. & చేతిపని వచ్చిన వారికి ప్రాధాన్యత. గుంటూరు సిటీలోని వారు మాత్రమే. 88859 88043

■ చిలకలూరిపేట దగ్గర గల ఫ్యాక్టరీలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను. శ్రీ రాజరాజేశ్వరి సెక్యూరిటీ సర్వీసెస్. సెల్ : 80082 02789, 70325 59533.

■ SBI - లైఫ్ చీరాల బ్రాంచ్ నందు డెవలప్‌మెంట్ మేనేజర్లుగా (6) డిగ్రీ అర్హత + మార్కెటింగ్ అనుభవంతో పనిచేయుటకు M/F కావలెను. జీతం 20వేలు + అపైన 99498 52819

■ క్రైస్తవ మందిరంలో పనిచేయుటకు మంచి విశ్వాసం గల కుటుంబం కావలెను. మరియు ఇంటిపని చేయుటకు డ్రైవర్లు & టెలికాలర్స్, ఆఫీస్ స్టాఫ్, సూపర్ వైజర్స్, మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. 6305122366

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటివద్దనే వుంటూ ఒక గంట పార్ట్ టైం మాన్యువల్ వర్క్ చేయుటకు స్త్రీ / పు।। కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. వివరాలకు వాట్సాప్ చేయండి. 98856 82589

■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ కంపెనీలో వర్క్ చేయుటకు మార్కెటింగ్ టీమ్స్, మార్కెటింగ్ టీమ్ లీడర్స్, ఎగ్జిక్యూటివ్స్ M/F కావలెను. జీతం:15k+ 7205583999, 9030110144

■ రియల్‌ఎస్టేట్ ఏజెంట్లకు అద్భుతమైన అవకాశం. ఒక సంవత్సరం పనిచేయండి. జీవితాంతం ఆదాయాన్ని పొందండి. వివరాలకు సంప్ర: 9888084333

■ బిజినెస్ మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రి, తెలుగు, ఇంగ్లీష్ బాషలపై నైపుణ్యం, 3సం।।ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, రెజ్యూములను hoadvtjobs@gmail.com కు పంపగలరు.

■ Wanted Male Campus Admin Incharges Qualification any Degree. Age Limit: 25 to 45 years (Must be Married) Salary upto: 25000/- Working Location Master Minds College, Guntur. Contact: 8978480430

■ ప్రముఖ దంత వైద్యశాల నందు పని చేయుటకు మార్కెటింగ్ Staff మరియు డ్రైవర్, హౌస్‌కీపింగ్ Staff కావలెను. సంప్ర: 95154 15343

■ గుంటూరు, లక్ష్మీపురంలోని AFTON Fitness Equipments స్టోర్స్ నందు పనిచేయుటకు సేల్స్ స్టాఫ్ & ఆఫీస్ బాయ్ కావలెను 9608099189, 7075703889

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663



**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుపయోగార్థ్యంగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ జియా

పొన్నూరు: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని సాంబశివనగర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ రక్తదాన ఆవశ్యకతను వివరించారు. శిబిరంలో మున్సిపల్, వార్డు సచివాలయం సిబ్బంది, పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వి.వి.గుప్త, కె. ఆంజనేయులు, కోశాధికారి, పి. రవీంద్రనాథ్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జె.రవి రాకేష్‌దేవ్, కార్యదర్శి ఎస్.బాలకృష్ణ పాల్గొన్నారు.


## కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవం ప్రారంభం

పొన్నూరు: ఆర్టీసీ డిపోలో కార్గో డోర్ డెలివరీ ప్రచార మా సోత్సవాలు శుక్రవా రం ప్రారంభమయ్యా యి. ఈ సందర్భంగా డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేనేజర్ అజితకుమారి మాట్లాడారు. కార్గోలో డోర్ డెలివరీ సేవలు ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్గో అందిస్తున్న డోర్ డెలివరీ సేవలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని సిబ్బందికి సూచించారు. క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా బహుమతులు, వస్తువులు కార్గో డోర్ డెలివరీ ద్వారా పంపడానికి మంచి అవకాశమని తెలిపారు. ప్రజలంతా సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, కార్గో సిబ్బంది పాల్గొన్నారు.

## బాల వికాస్ కేంద్ర హాస్టల్ వద్ద పూర్వ విద్యార్థుల ఆందోళన

గుంటూరు రూరల్: నగర శివారు రెడ్డిపాలెంలోగల బాలవికాస్ కేంద్రం హాస్టల్‌లో భవనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు కూల్చి వేస్తున్నారని శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆందోళన చేశారు. విషయం తెలిసిన పోలీసులు రంగంలోకి దిగి వారికి సర్దిచెప్పి పంపారు. 1980లో డెహ్రాడూన్‌కు చెందిన ఒక సంస్థ రెడ్డిపాలెంలో ప్రైవేటు వ్యక్తుల వద్ద భూమిని కొనుగోలు చేసింది. అందులో బాలవికాస్ కేంద్రం, న్యూలైఫ్ సెంటర్‌ను నిర్మించారు. కొన్నాళ్లపాటు అందులో పేద విద్యార్థులకు విద్యను అందించారు. అనంతరం గత పదేళ్లుగా కేంద్రాన్ని ఆ సంస్థ మూసివేసింది. బైలా ప్రకారం సంస్థ సభ్యులు ఆ స్థలాన్ని విక్రయించారు. అందుకుగానూ డెహ్రాడూన్‌కు చెందిన ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నారు. అనంతరం సభ్యులలో ఒకరిని సెక్రటరీగా నియమించి ఆ స్థలాన్ని విక్రయించి రిజిస్ట్రేషన్ చేసే బాధ్యతలు అప్పగించారు. ఈ స్థలాన్ని విక్రయించిన అనంతరం ఆ నగదుతో ఏ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారో తెలపాలని డెహ్రాడూన్ ప్రభుత్వం ఆ సంస్థను ఆదేశించింది. ఆ తర్వాత అనుమతులతో సంస్థ ఆ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించింది. అనంతరం గతంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. కొనుగోలుదారులకు అప్పగించాలని సంస్థ సభ్యులు భవనాన్ని గురువారం రాత్రి కూల్చివేతను ప్రారంభించారు. విషయం తెలిసిన పూర్వ విద్యార్థులు ఆందోళనకు దిగారు. పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలికి చేరుకుని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకుని సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## వివా, వీవీఐటీల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు



పెదకాకాని: వివా, వీవీఐటీ సంస్థలలో క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీస్తు గీతాలాపన, నృత్యాలు అలరించాయి. శాంతా క్లాజ్ రూపంలో విద్యార్థుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శాంతా క్లాజ్‌లు విద్యార్థులకు బహుమతులను అందజేశారు. క్రీస్తు జననాన్ని పురస్కరించుకొని కళాశాల చైర్మెన్ వాస్ రెడ్డి విద్యాసాగర్, వాసిరెడ్డి అరుణప్రియ దంపతులు కేక్ ను కట్ చేసి విద్యార్థులకు అందించారు.

## సృజనాత్మకతకు చదువుతో పనిలేదు



గుంటూరు రూరల్: నేడు సాంకేతికత అభివృద్ధి చెంది ప్రపంచం శరవేగంతో ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రవీందర్‌చౌదరి తెలిపారు. గుంటూరు నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం గ్లోబల్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై ఆదాయం నాలుగు ట్రిలియన్ డాలర్లకు పెరిగిందని తెలిపారు. 2024లో భారతదేశంలో 23 శాతం వరకు పెరిగిందని చెప్పారు. సృజనాత్మకతకు చదువుతో పని లేదని, సాకారాత్మక ఆలోచనలు కలిగి ఉంటే నంబర్ వన్ స్థానానికి ఎదగవచ్చని సూచించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంగా యువత నూతన ఆలోచనలతో ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్, ఏ. రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

## రేపు చెస్ పోటీలు

గుంటూరు రూరల్: చలపతి ఫార్మసీ కళాశాల వేదికగా ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, ఆనంద్ చెస్ వింగ్స్ - గుంటూరు సంయుక్తంగా పోటీలు నిర్వహించనున్నాయని పేర్కొన్నారు. శుక్రవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో సంబంధిత గోడ ప్రతులను ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ సీఎం గోపీనాథ్‌తో కలిసి విడుదల చేశారు.